

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి.



టమాట కిలో రూ.40

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.40 పలికింది. కనిష్టం రూ.27, సరాసరి రూ.34 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం 34.1°/22.6°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 15 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఎస్సీ కాలనీకి కరెంట్ కట్



ఆందోళన చేస్తున్న ఎస్సీ కాలనీవాసులు

కణేకల్లు: మండలంలోని యర్రగుంట గ్రామ ఎస్సీ కాలనీకి విద్యుత్‌శాఖ అధికారులు బుధవారం రాత్రి కరెంటు సరఫరా నిలిపేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. దీంతో కాలనీ అంధకారంగా మారింది. వివరాలు.. కాలనీలో మొత్తం 450 ఇళ్లున్నాయి. ఎస్సీలకు రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచితంగా కరెంటు అందిస్తోంది. అయితే, యర్రగుంట ఎస్సీ కాలనీలో 63 ఇళ్లవారు 200 యూనిట్లకు పైగా విద్యుత్ వాడడంతో సిబ్బంది బిల్లులు ఇచ్చారు. బిల్లులు కట్టకపోవడంతో బుధవారం రాత్రి మొత్తం కాలనీకి కరెంటు సరఫరా కట్ చేశారు. ఈ క్రమంలో స్థానికులు బుధవారం రాత్రి ఆందోళనకు దిగారు. కొంతమంది బిల్లులు కట్టకపోతే మొత్తం కాలనీకే కరెంటు సరఫరా ఎలా ఆపేస్తారంటూ వాపోయారు. అధికారులు స్పందించకుంటే రాస్తారోకో చేస్తామంటూ హెచ్చరించారు. తామేం పాపం చేశామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే స్పందించిన అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. కాలనీకి కరెంటు సరఫరా పునరుద్ధరించారు. కరెంటు బిల్లులు వచ్చిన వారు డబ్బు చెల్లించాలని ఏఈఈ శంకర్‌నాయక్ కోరారు.

2న కలెక్టరేట్ వద్ద 'ఫ్యాప్టో' ధర్నా

అనంతపురం ఎడ్యుకేషన్: బదిలీ ఉపాధ్యాయులకు వేతనాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన పీఆర్సీ, ఐఆర్, డీఏ, సరెండర్ లీవ్స్, సీపీఎస్ ఉపాధ్యాయుల అరియర్స్ తదితర సమస్యలపై రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆగస్టు 2న ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఫ్యాప్టో) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నారు. ఇందుకోసం సన్నాహక సమావేశం బుధవారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో నిర్వహించారు. ధర్నాకు ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఫ్యాప్టో ప్రతినిధులు ఆర్.శ్రీనివాస్ నాయక్,పురుషోత్తం,లింగమూర్తి, గోవిందరాజులు, రమణారెడ్డి, వెంకటేష్, వెంకటరత్నం, సిరాజుద్దీన్, మల్లికార్జున, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సబ్సిడీతో గడ్డి జొన్నల పంపిణీ

అనంతపురం అగ్రికల్చర్: పాడి రైతులకు 75 శాతం రాయితీతో గడ్డి జొన్నలు (ఫాడర్ సీడ్) పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జ్ జేడీ డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మి, ఏడీ డాక్టర్ రాధిక బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాకు 77 టన్నులు కేటాయించగా, వీటిని ఇప్పటికే అన్ని పశువుల ఆస్పత్రులకు సరఫరా చేశారు. కిలో గడ్డి జొన్నలు పూర్తి ధర రూ.92 కాగా, రూ.69 రాయితీ పోనూ లబ్ధిదారులు తమ వాటా కింద రూ.23 చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో రైతుకు 20 కిలోల వరకూ పంపిణీ చేస్తారు. పశువుల ఆస్పత్రుల్లో ఏడీలు, డాక్టర్లను సంప్రదించి సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

ఈ-క్రాప్ పక్కాగా నమోదు చేయాలి

- ఉద్యానశాఖ డీడీ ఉమాదేవి ఆదేశం



వీసీలో మాట్లాడుతున్న డీడీ ఉమాదేవి

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుతం సాగులో ఉన్న అన్ని రకాల ఉద్యాన పంటలను తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.ఉమాదేవి ఆదేశించారు. బుధవారం స్థానిక ఉద్యానశాఖ కార్యాలయంలో టెక్నికల్ హెచ్‌ఓ రత్నకుమార్‌తో కలిసి క్షేత్రస్థాయి హెచ్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. అన్ని రకాల పాత తోటలతో పాటు కొత్త తోటల విస్తీర్ణం, రైతుకు సంబంధించిన అన్ని వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఎంపీఈఓలు, వీఏఏ, వీహెచ్‌ఏ, వీఎస్‌ఏలను సమన్వయం చేసుకుని రోజువారీ పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. ఆర్‌ఎస్‌కేల వారీగా ఈ-క్రాప్ గణాంకాలు పారదర్శకంగా వెల్లడయ్యేలా చూడాలన్నారు. అలాగే గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ విడుదలైందని, ఈ ఏడాది యాక్షన్ ప్లాన్ ప్రకారం అర్హత కలిగిన రైతులను గుర్తించాలని ఆదేశించారు. ఎంఐడీహెచ్, ఆయిల్‌పాం, బ్యాంబూ మిషన్, ఆర్‌కేవీవై కింద పథకాలు అమలు చేయాలని సూచించారు.

బాబు హామీలన్నీ గాలి మాటలే





రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, పార్టీ నేతలు,సమావేశానికి హాజరైన నాయకులు

- మోసం చేయడం ఆయన నైజం
- రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో తారస్థాయికి 'పరిటాల' దందాలు
- అక్రమ కేసులకు భయపడేది లేదు
- రౌడీ రాజ్యాంగాన్ని అంతమొందించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



రాప్తాడులో హత్యకు గురైన రైతు దంపతుల కుమారుడు ప్రదీప్‌కుమార్‌రెడ్డికి ధైర్యం చెబుతున్న ప్రకాష్ రెడ్డి

రాప్తాడురూరల్: అధికారం కోసం చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ గాలిమాటలుగా మారాయని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు.'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా బుధవారం అనంతపురం నగర శివారు టీవీ టవర్ సమీపంలో ఎస్‌జేఆర్ ఫంక్షన్ హాలులో రాప్తాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. రాప్తాడు వైస్ ఎంపీపీ రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశానికి మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రరెడ్డి, బుక్కచెర్ల నల్లపరెడ్డి తదితరులు హాజరయ్యారు. సమావేశానికి రాప్తాడు నియోజకవర్గ నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ అధికారం కోసం చెప్పిన హామీలు చెప్పకుండా కొత్త హామీలతో మోసం చేయడం చంద్రబాబు నైజం అన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్ల అమలులో అతుకులు బొతుకులే ఉన్నాయన్నారు. కొత్త ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, రైతు భరోసా, ఉచిత బస్సు ప్రయాణం, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1,500 పథకాలు తుస్సుమన్నాయన్నారు. ఏడాదిలో రూ. 1.80 లక్షల కోట్లు అప్పులు తేవడమే బాబు సృష్టించిన సంపద అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు కట్టుకథలన్నీ ప్రజలకు అర్థమయ్యాయన్నారు. ప్రజలు తిరగబడే రోజులు దగ్గర పడ్డాయన్నారు. పాడి మహిళా రైతుల కోసమే తన సొంత నిధులతో 'అమ్మా' డెయిరీని ఏర్పాటు చేశానన్నారు. డెయిరీ నిర్వహణకు ఇబ్బందులు కల్గించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపిస్తే అమూల్ డెయిరీకి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రకటించారు.

దేవర దున్నపోతుల్లా వదిలారు..

రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో అక్రమ వసూళ్లకు పరిటాల కుటుంబ సభ్యులు, బంధువులను దేవర దున్నపోతుల్లా వదిలారని ప్రకాష్ రెడ్డి ధ్వజమెత్తారు. పరిటాల కుటుంబం కోసం కేసుల్లో ఇరుక్కున్న బీసీ,ఎస్సీ,ఎస్టీల గురించి ఏమాత్రమూ పట్టించుకోవడం లేదన్నారు. పరిటాల సునీత కుమారులు, సోదరులు వసూల్ రాజాల అవతారం ఎత్తారన్నారు. అనంతపురం రూరల్,ధర్మవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎవరు రిజిస్ట్రేషన్ చేసుకున్నా పరిటాల కుటుంబానికి కప్పం కట్టాలంట... ఇదేమైనా వాళ్ల నాయన గంటా అని మండిపడ్డారు. కక్కలపల్లి టమాట మండీలో 'పరిటాల శ్రీరామ్ ట్యాక్స్' విధిస్తున్నారని, ఒక్కో బండికి రూ. 2,500 వసూలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటిదాకా పరిటాల కుటుంబం రూ. 30 కోట్లు వసూలు చేసిందన్నారు. వీరి దురాగతాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. ఇలాంటి కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో సాగుతున్న రౌడీ రాజ్యాంగాన్ని అంతమొందించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు. అనంతరం 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' క్యూఆర్ కోడ్‌లు విడుదల చేశారు.

పరామర్శకు వెళ్తే కేసులు పెట్టారు..

'రామగిరి మండలంలో ఒక దళిత బాలికను టీడీపీ గూండాలు గ్యాంగ్‌రేప్ చేశారు. ఈ విషయంపై నిరసన తెలియజేసేందుకు వెళ్తుంటే అరెస్టులు చేశారు. అక్రమ కేసులు పెట్టారు. ఎస్సీ నాయకులపై కూడా కేసులు బనాయించారు. మహిళలను మానభంగం చేస్తే ప్రశ్నించకూడదా? ఇటీవల అరవిందరెడ్డి అనే టీడీపీ కార్యకర్త ధర్మవరంలో ప్రెస్‌మీట్ పెట్టి పరిటాల రవీంద్ర వందమంది రెడ్లను హత్య చేయించాడన్నందుకు పరిటాల శ్రీరామ్ గూండాలు అతడి కాళ్లు, చేతులు విరగ్గొట్టారు. ఇది రెడ్‌బుక్ రాజ్యాంగం కాదా? పరిటాల శ్రీరామ్ ధర్మవరంలో తనకు ఎదురులేదనుకుంటున్నాడు. ధర్మవరం చరిత్రలో చేనేతల జోలికి ఎవరూ వెళ్లలేదు, కానీ శ్రీరామ్ వారి నుంచి కూడా బలవంతంగా డబ్బు వసూలు చేస్తున్నాడు. ఆస్తులు కూడా లాక్కుంటున్నాడు' అని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు.

'అమ్మా' అనే పిలుపులేకుండా చేశారు

అక్రమంగా తమ భూమిని కాజేసేందుకని తనకు 'అమ్మా' అనే పిలుపులేకుండా చేశారని రాప్తాడులో ఇటీవల టీడీపీ నాయకుల చేతుల్లో హత్యకు గురైన చిగిచెర్ల నారాయణరెడ్డి, చిగిచెర్ల ముత్యాలమ్మల కుమారుడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి కన్నీటి పర్యంతమయ్యాడు. పరిటాల సునీత, ధర్మవరపు మురళీ అండతోనే హత్యకు పాల్పడ్డారని, తన కళ్లముందే కొడవళ్లు, కట్టెలతో తన తల్లిదండ్రులపై దాడి చేశారని వాపోయాడు. టీడీపీ నాయకులు కనికరం లేకుండా తనకు అమ్మా అనే పిలుపులేకుండా చేశారని, తమ బాధ ఎవరికి చెప్పుకోవాలని కన్నీళ్లు పెట్టుకున్నాడు. హత్య కేసులోని ముగ్గురు నిందితులు ఇప్పటికీ బయటే తిరుగుతున్నారని, నిందితుల ఇళ్లకు పరిటాల సునీత, మురళీ తదితరులు వెళ్లి పరామర్శించి వచ్చారని చెప్పాడు. ఇంకోవైపు తన తండ్రి టీడీపీ నాయకుడంటూ ప్రచారం చేసి రాజకీయం చేయాలని చూశారని, మరి వారు మమ్మల్ని ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించాడు. 'ప్రకాష్‌రెడ్డి మా కుటుంబానికి అండగా నిలిచారు. మా కుటుంబం చచ్చేదాకా వైఎస్సార్‌సీపీతోనే ఉంటుంది' అని స్పష్టం చేశాడు.

మా నాన్నను చంపారు



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్కన ఉన్నామనే మా నాన్న లింగమయ్యను హత్య చేశారు. నాపైనా దాడి చేశారు. 15 మంది దాడి చేస్తే ఇద్దరిపై మాత్రమే కేసు కట్టారు. జైల్లో ఉన్న నిందితులు బయటకు రాగానే మమ్మల్ని చంపుతారని చెబుతున్నారు. భయపడే ప్రసక్తేలేదు. పార్టీ కోసం నిలబడతాం. మా ఊరిలో చాలా రాజకీయం చేస్తున్నారు. జగనన్న మా ఇంటికి వచ్చినప్పుడు చాలా భరోసా ఇచ్చారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాకు అండగా ఉన్నారు.

– మజ్జిగ మనోహర్, పాపిరెడ్డిపల్లి

హామీలపై ప్రశ్నిస్తారనే కేసులు



హామీలపై ప్రశ్నిస్తారనే భయంతోనే వైఎస్సార్‌సీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. చివరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కూడా ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. కార్యకర్తలే ముందుండి పార్టీని నడిపిస్తారు.

– తోపుదుర్తి చందు, వైఎస్సార్‌సీపీ నేత

మోసానికి బ్రాండ్ అంబాసిడర్



మోసానికి బ్రాండ్ అంబాసిడర్ బాబు. ఎన్నికల ముందు అబద్ధపు హామీలతో ఇంటింటికీ బాండ్లు ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్కటీ అమలు చేయలేదు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారు. ప్రజల కోసం పాటుపడే జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం. –బోయ గిరిజమ్మ,జెడ్పీ చైర్‌పర్సన్

ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి



అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు చేసిన మోసాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రాప్తాడు నియోజకవర్గం ప్రశాంతంగా ఉండేది. 'కూటమి' ఏడాది కాలంలోనే ఎంతలా మారిందో ప్రజలంతా చూస్తున్నారు. జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి.

– మంగమ్మ, ఎమ్మెల్సీ

ఉడత ఊపులకు భయపడం



రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఉడత ఊపులకు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భయపడరు. ఎన్ని అక్రమ కేసులు బనాయించినా ఆయన ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే ముందుకెళ్తున్నారు. వారి దురాగతాలను ఇంటింటికీ వెళ్లి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉంది. 'స్థానిక' ఎన్నికల్లో మన సత్తా చాటి చెబుదాం.

–వెన్నపూస రవీంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు

ఉత్సాహం తగ్గలేదు



గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓడినా కార్యకర్తల్లో ఏ మాత్రమూ ఉత్సాహం తగ్గలేదు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశయాల సాధన కోసం తనయుడు జగన్ పరితపిస్తున్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనను రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటారు. బడుగు, బలహీన వర్గాలు, వెనుకబడిన వర్గాలు ఎప్పుడూ వైఎస్ జగన్‌కు అండగా ఉంటాయి.

– నల్లపరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

ధనదాహం.. దౌర్జన్యం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో కంపెనీలు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ససేమిరా అంటున్నారు. కూటమి నేతల దెబ్బకు ఒక్క కొత్త కంపెనీ కూడా రాని దుస్థితి నెలకొంది. ఇటీవల గ్రీన్‌టెక్ రీమిక్స్ కంపెనీ ప్రతినిధులపై మంత్రి సవిత అనుచరులు బెదిరింపులకు దిగిన విషయం మరచిపోకముందే.. తాజాగా 'కియా' కార్ల పరిశ్రమల్లో కాంట్రాక్టుల కోసం మంత్రి అనుచరులు రభస చేయడం జిల్లాలోనే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. చిన్న పరిశ్రమ స్థాపనకు రేకుల షెడ్డు వేసినా ఎమ్మెల్యేలు వసూళ్లకు తెగబడుతుండడంతో పెట్టుబడిదారులు రావడం లేదు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం దారుణంగా పడిపోయింది.

- అక్రమార్జనకు 'తమ్ముళ్ల' అర్రులు
- చెప్పినట్లు వినకుంటే దౌర్జన్యాలు
- ఇప్పటికే తారస్థాయికి ప్రజాప్రతినిధుల దందాలు
- భయభ్రాంతులకు గురవుతున్న పారిశ్రామికవేత్తలు
- కూటమి సర్కారు వచ్చాక ఒక్క కొత్త పరిశ్రమా ఏర్పాటు కాని వైనం



మంగళవారం కియా అనుబంధ పరిశ్రమ 'సంఘు హైటెక్' వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పరిశ్రమల స్థాపనకు రాష్ట్రంలోనే ఉమ్మడి అనంతపురం జిల్లా అత్యంత అనువైన ప్రాంతంగా పేరుపొందింది. అలాంటి జిల్లాలో పరిశ్రమలు స్థాపించి ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన కూటమి సర్కారు ఆ విషయాన్ని అసలు పట్టించుకోవడమే లేదు. కూటమి సర్కారు వచ్చి 13 మాసాలు దాటినా శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో ఒక్కటంటే ఒక్క చిన్న పరిశ్రమ కూడా ఏర్పాటు కాకపోవడమే ఇందుకు నిదర్శనం.

గ్రీన్‌టెక్ రీమిక్స్ కంపెనీకి బెదిరింపులు..

కూటమి ప్రజాప్రతినిధుల ముడుపుల దాహానికి పారిశ్రామికవేత్తలు బెంబేలెత్తుతున్నారు. రూ.10 లక్షల పెట్టుబడి పెట్టేందుకు కూడా వెనుకడుగు వేస్తున్న దుస్థితి నెలకొంది. పెనుకొండ నియోజకవర్గంలో కొన్నేళ్లుగా గ్రీన్‌టెక్ రీమిక్స్ కంపెనీ నడుస్తోంది. కూటమి సర్కారు రాగానే ఆ కంపెనీని సొంతం చేసుకోవాలని ఆ ప్రాంత మంత్రి పట్టుబట్టారు. అందుకు ఒప్పుకోక పోవడంతో కంపెనీకి ముడిసరుకు సప్లై కాకుండా ఆపివేయించారు. దీంతో విధిలేక సదరు కంపెనీ ప్రతినిధులు టీడీపీకి చెందిన ఎంపీతో మాట్లాడుకుని ప్లాంటులో 50 శాతం భాగస్వామ్యం ఇచ్చారు. పరిశ్రమలను ప్రోత్సహించాల్సిన మంత్రే బెదిరింపులకు పాల్పడిన అంశం ఉమ్మడి జిల్లాలో అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

ఉమ్మడి జిల్లాలో పరిస్థితి ఇదీ

కేటగిరీ	క్లెయిమ్స్	మార్జిన్ మనీ (రూ.లలో)
ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ	06	55,21,384
పవర్ కాస్ట్ రీయింబర్స్‌మెంట్	09	5,30,036
ఇంట్రెస్ట్ సబ్సిడీ	06	2,34,621
మొత్తం	21	62,86,041

(అన్నీ కలిసి సబ్సిడీలు రూ.62 లక్షలే అంటే పరిస్థితి అంచనా వేయొచ్చు)

కియాలో దౌర్జన్యకాండ..

డీజిల్, మట్టి దందాలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రికి.. తాజాగా 'కియా' పరిశ్రమపై కన్నుపడింది. 'కియా'లో పలు రకాల కాంట్రాక్టులు థర్డ్ పార్టీకి ఇస్తారు. ఎప్పట్నుంచో ఇది నడుస్తున్నదే. కియా చుట్టూ పలు అనుబంధ పరిశ్రమలూ వచ్చాయి. అయితే కియాలో కాంట్రాక్టులన్నీ తమకే కావాలని మంత్రి సవిత అనుచరులు రెండు రోజుల క్రితం దౌర్జన్యానికి దిగారు. మంత్రి అనుచరులు వందల మంది రావడంతో కియా కంపెనీ ప్రతినిధులు ఒక్కసారిగా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కియా తన మానస పుత్రిక అని చెప్పుకునే చంద్రబాబు.. తన కేబినెట్‌లోని మంత్రే బెదిరిస్తుండటాన్ని నిలువరించలేకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

భూమి పూజ రోజు నుంచే..

ఏదైనా పరిశ్రమ పెడదామని ఎవరైనా భూమి పూజ చేస్తే ఆ రోజునుంచే ఎంత ఇస్తారు, ఇవ్వకపోతే పరిశ్రమలు నడుపుకోలేరు అంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు, వారి అనుచరులు దౌర్జన్యం చేస్తున్న పరిస్థితి. చివరకు బెంగళూరు–హైదరాబాద్ జాతీయ రహదారిలో ఉన్న ధాబాలు, హోటళ్లను సైతం నేతలు వదలడం లేదు. నెలనెలా మామూళ్లు ఇవ్వకపోతే ఇక మీ ఇష్టం అంటూ బెదిరిస్తున్నారు. సర్కస్ కంపెనీలు నడవాలన్నా ముడుపులు డిమాండ్ చేస్తున్న దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో కొత్తగా పరిశ్రమలు పెట్టడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో కొత్త ఉద్యోగాలు రాకపోగా, ఉన్న ఉద్యోగాలూ పోతున్న దుస్థితి నెలకొంది.

ఐదు మండలాల్లో బయోగ్యాస్ ప్లాంట్లు



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: జిల్లాలో కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. రీ–సర్వే, చుక్కల భూముల, పీజీఆర్ఎస్, పౌర సరఫరాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని చెప్పారు. రెవెన్యూ సెక్టార్, పౌర సరఫరాలు, తదితర అంశాలపై బుధవారం కలెక్టరేట్ నుంచి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓలు, డీఎస్ఓ, తహసీల్దార్లు, ఆర్ఎస్‌డీటీలు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గుంతకల్లు, పుట్లూరు, కుందుర్పి, యల్లనూరు, కూడేరు మండలాల్లో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి బయోగ్యాస్ ఉత్పత్తికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రకియకు సోలార్ ప్రవర్ ప్రాజెక్టుల అధికారులు సహకరించాలన్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి రేషన్ పంపిణీ సక్రమంగా జరగాలన్నారు. చౌక ధరల దుకాణాలను తహసీల్దార్లు, సీఎస్‌డీటీలు, ఎంఎల్ఎస్ పాయింట్లను ఆర్డీఓలు తనిఖీ చేయాలని ఆదేశించారు. రీ–సర్వే, రైల్వే, నెడ్‌క్యాప్ ప్రాజెక్టులకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ ఎ.మలోల, డీఎస్ఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి సిద్ధంకండి

ఎన్టీఆర్ భరోసా పథకం కింద ఆగస్టు 1 నుంచి పింఛన్ల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత అధికారులను ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ ఆదేశించారు. పింఛన్ల పంపిణీ అంశంపై బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో ఆయన వీడియోకాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జిల్లాలో 2.80 లక్షల మంది పింఛనుదారులకు రూ.124.99 కోట్లు పంపిణీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. పంపిణీ ప్రక్రియ ఒకటో తేదీ ఉదయం 7 గంటల నుంచి ప్రారంభించాలని చెప్పారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛను సొమ్ము అందించాలని ఆదేశించారు. పింఛను పంపిణీ తీరుపై ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రభుత్వం ఫీడ్ బ్యాక్ తీసుకుంటుందన్నారు. ఏదేని కారణం చేత పింఛన్లు పంపిణీ కాకపోతే వాటి సొమ్మును రెండు రోజుల్లోగా బ్యాంక్‌లో కట్టాలని ఆదేశించారు. కొత్తగా చేరిన డీడీఓల నమూనా సంతకాలను ఆయా బ్యాంకు ఖాతాల్లో నవీకరించాలని ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ పీడీ శైలజ తదితరులు పాల్గొన్నారు.

భద్రతా నియమాలను పాటించాలి : డీఆర్ఎం



మాట్లాడుతున్న డీఆర్ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు: భద్రతా నియమాలను కచ్చితంగా పాటిస్తూ రైలు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా ఆదేశించారు. బుధవారం స్థానిక డివిజనల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లతో ఆయన సమావేశమై మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలంలో అండర్ బ్రిడ్జిలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. సురక్షితం కాని ట్రాక్‌లు, వంతెనలు, భారీ వర్షాలు కురిసే ప్రదేశాల్లో తప్పనిసరిగా పెట్రోలింగ్ చేపట్టాలన్నారు. ఇటీవల తిరుపతి రైల్వేస్టేషన్ ఔటర్‌లో జరిగిన అగ్ని ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని పొగను గుర్తించే పరికరాలు, అగ్నిమాపక యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ డీఓఎం డాక్టర్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ద్విచక్ర వాహనాల ఢీ - మహిళ మృతి


మృతురాలు లక్ష్మీదేవి

పెద్దపప్పూరు: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. పెద్దపప్పూరు మండలం శింగనగుట్టపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవి(60) బుధవారం ఉదయం తన కుమారుడు రామాంజనేయులుతో కలసి పొలానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఘటనలో రోడ్డుపై పడిన లక్ష్మీదేవి అక్కడికక్కడే మృతి చెందింది. రామాంజనేయులుతో పాటు ప్రమాదానికి కారణమైన మరో ద్విచక్ర వాహనదారుడు ఎర్రిస్వామికి గాయాలయ్యాయి. కాగా, నార్పల మండలం కేసేపల్లికి చెందిన ఎర్రిస్వామి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ద్విచక్ర వాహనాన్ని వేగంగా నడుపుతూ ప్రమాదానికి కారణమైనట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. ఘటనపై ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జిల్లాకు 2,152 మెట్రిక్ టన్నుల ఎరువులు


జిల్లాకు చేరిన ఎరువులను పరిశీలిస్తున్న ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్

అనంతపురం అగ్రికల్చర్: వివిధ కంపెనీల నుంచి 2,152 మెట్రిక్ టన్నుల ఎరువులు బుధవారం జిల్లాకు సరఫరా అయ్యాయి. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్ పాయింట్‌కు వ్యాగన్ల ద్వారా చేరిన ఎరువులను రేక్ ఆఫీసర్, ఏడీఏ జీఎం అల్తాఫ్ అలీఖాన్ పరిశీలించారు. కోరమాండల్ కంపెనీ నుంచి 10-26-26 రకం కాంప్లెక్స్ ఎరువులు 1,316 మెట్రిక్ టన్నులు, ఫ్యాక్ట్ కంపెనీ నుంచి 836 మెట్రిక్ టన్నుల అమ్మోనియం సల్ఫేట్ వచ్చిందన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌ఎస్‌కేలు, సొసైటీలు, ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేయడంతో పాటు మిగిలినవి కంపెనీ గోదాముల్లో నిల్వ చేయనున్నట్లు తెలిపారు.

మట్కా బీటర్ల అరెస్ట్

తాడిపత్రి టౌన్: మండలంలోని చుక్కలూరు క్రాస్ వద్ద మట్కా రాస్తున్న ఇద్దరు బీటర్లను బుధవారం అరెస్ట్ చేసి, రూ.1,01,770 నగదు, పట్టీలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ధరణీబాబు తెలిపారు. పట్టుబడిన వారిలో కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన కాకర్ల రాఘవేంద్ర, కాకర్ల మల్లికార్జున ఉన్నారు. రెండు నెలల క్రితం చుక్కలూరు క్రాస్‌కు వలస వచ్చిన వీరు అక్కడే నివాసముంటున్నారు. అందిన పక్కా సమాచారంతో బుధవారం పోలీసులు తనిఖీలు చేపట్టి ఓ టీ దుకాణం వద్ద మట్కా పట్టీలు చూసుకుంటున్న ఇద్దరినీ అరెస్ట్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోతల రేషన్

- పేదలకు సరుకులు దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- ఇప్పటికే కందిపప్పు పంపిణీకి మంగళం
- మూడు నెలలుగా నిలిచిన జొన్నలు



అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి తూట్లు పొడుస్తోంది. రేషన్ సరుకుల్లో 'కోత'లు పెడుతోంది. పేదలకు పౌష్టికాహారం అందించాలనే ప్రధాన ఉద్దేశంతో ప్రవేశపెట్టిన జొన్నల పంపిణీ మూడు నెలలుగా నిలిపివేసింది. ప్రస్తుత నెలలో అరకొరగా చౌక దుకాణాలకు సరఫరా చేసిన జొన్నలు కూడా రంగు మారి నాసిరకంగా ఉండడంతో కార్డుదారులు వాటిని తీసుకునేందుకు విముఖత చూపుతున్నారు. ఆగస్టుకు సంబంధించి జొన్నల స్టాక్‌ను చౌక దుకాణాలకు సరఫరా కాలేదని సమాచారం. ఫిబ్రవరి నుంచి కంది పప్పు పంపిణీ నిలిపేసిన ప్రభుత్వం.. తాజాగా జొన్నలనూ అందించకపోవడం గమనార్హం.

కోతలు కనిపించవా..

గత ప్రభుత్వం ప్రతి నెలా కందిపప్పు సక్రమంగా పంపిణీ చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గత ప్రభుత్వం కొనుగోలు చేసి ఉంచిన స్టాక్ ఉన్నంత వరకు కందిపప్పును పంపిణీ చేసింది. అటు తరువాత కందిపప్పు కొనుగోలుకు టెండర్లు నిర్వహిస్తోందని అధికారులు చెబుతూ వచ్చినప్పటికీ ఆ ప్రక్రియ జరగలేదని తెలుస్తోంది. దీంతో పేదల కందిపప్పు మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో కార్డుదారులకు ప్రతి నెలా నాణ్యమైన కందిపప్పు, జొన్నలు, రాగులు సక్రమంగా పంపిణీ చేసినా కొందరు పనిగట్టుకుని విమర్శలు చేస్తూ వచ్చారు. ఆ 'పచ్చ' కళ్లకు నేడు కూటమి ప్రభుత్వం పేదలకు పెడుతున్న 'కోతలు... వాతలు' కనిపించడం లేదా అనే విమర్శలు వినవస్తున్నాయి.

రూ.57 కోట్ల భారం

కూటమి ప్రభుత్వం ఏడు నెలలుగా కందిపప్పు, మూడు నెలలుగా జొన్నలు ఇవ్వకపోవడంతో పేదలపై రూ.57.08 కోట్ల భారం పడింది. ప్రతి కుటుంబం నెలకు ఒక కిలో కందిపప్పు, మూడు కిలోలు జొన్నలు వినియోగిస్తారు. ప్రభుత్వం కిలో కంది పప్పు రూ.67తో, జొన్నలు మూడు కిలోలు వరకు ఉచితంగా పంపిణీ చేయాల్సి ఉంది. మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.140, జొన్నలు కిలో రూ.40 వరకు ఉంది. చౌక దుకాణంలో పంపిణీ చేయకపోవడంతో కార్డుదారులు మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. దీంతో కిలో కందిపప్పుపై రూ.73 అదనంగా, మూడు కిలోలు జొన్నలకు రూ.120 వెచ్చించాల్సి వస్తోంది. ఇలా ఏడు నెలలుగా కందిపప్పు కోసం కార్డుదారులు రూ.33.72 కోట్లు ఖర్చు చేశారు. మూడు కిలోల జొన్నలకు మూడు నెలల్లో రూ.23.36 కోట్లు ఖర్చు చేసుకున్నారు. ప్రభుత్వం పంపిణీ చేయని కారణంగా పేదలకు ఈ ఖర్చంతా అదనపు భారమే అయ్యింది.

జొన్నలు సన్నగా ఉన్నాయి



గతంలో నంద్యాల నుంచి నుంచి జొన్నలు వచ్చేవి. ఇటీవల జిల్లాలోనే జొన్నలు కొనుగోలు చేశాం. వర్షం కారణంగా రంగుమారాయి. అదేవిధంగా సన్నగానూ ఉన్నాయి. ప్రస్తుతం కొన్ని చౌకదుకాణాలకు సరఫరా చేశాం. అటు తరువాత నెల నుంచి సక్రమంగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– రమేష్‌రెడ్డి, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ

జిల్లాలో...

మొత్తం చౌక ధరల దుకాణాలు	1,645
బియ్యం కార్డులు	6,60,330
నెలసరి కందిపప్పు కోటా	615 టన్నులు
నెలసరి జొన్నలు కోటా	416 టన్నులు
కందిపప్పు ప్రభుత్వ ధర కిలో	రూ.67
జొన్నలు మూడు కిలోల వరకు	ఉచితం
మార్కెట్‌లో కందిపప్పు కిలో	రూ.140
మార్కెట్‌లో జొన్నలు కిలో	రూ.40

వైఎస్సార్‌సీపీ నేతల అరెస్ట్


పోలీసుల అదుపులో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పర్యటన అడ్డుకుంటారనే సాకుతో బుధవారం వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో విద్యార్థి విభాగం రాష్ట్ర నేత షెక్షావలి, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు గూబనపల్లి నాగరాజు, కో ఆప్షన్ సభ్యుడు సల్లా మారుతి, మమతా సురేష్, నాయకులు బిక్కి హరి, చరణ్, దొడగట్ట మురళి, ఎరికల రమేష్, అజయ్, టైలర్ శీన, సూరి, వడ్డే అజయ్ ఉన్నారు. ఉదయం అరెస్ట్ చేసిన వారిని సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టును వైఎస్సార్‌సీపీ జిల్లా డాక్టర్ల విభాగం అధ్యక్షుడు బొమ్మయ్య ఖండించారు. వైఎస్సార్‌సీపీ నేతలు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలు చీకటి మయం అయ్యాయని మండిపడ్డారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా మద్యం ఏరులై పారుతోందని విమర్శించారు.

రైతుకు న్యాయం చేస్తాం


కళింగర పంటను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

పెద్దపప్పూరు: కళింగర పంట సాగు చేసి నష్టపోయిన రైతుకు న్యాయం చేస్తామంటూ హెచ్‌ఓ ఉమాదేవి, ఏఓ మహిత భరోసా ఇచ్చారు. పెద్దపప్పూరు మండలం పసలూరు గ్రామానికి చెందిన రైతు మద్దా ప్రసాద్ 43 రోజుల క్రితం సాగు చేసిన కళింగర పంట ఎదుగుదల లేక నష్టపోయిన అంశంపై 'విత్తన లోపమా.. ప్రకృతి శాపమా' శీర్షికన బుధవారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై వారు స్పందించారు. బుధవారం ఉదయం పసలూరుకు చేరుకుని పంటను పరిశీలించారు. విత్తనాలు ఎక్కడ కొనుగోలు చేసింది రైతు ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. పంట ఎదుగుదల లేదని నిర్ధారించి, ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు వచ్చి పరిశీలించే వరకూ పంట తొలగించరాదని సూచించారు.

కుక్కల దాడిలో మేకల మృతి



గుమ్మఘట్ట: కుక్కల దాడిలో 12 మేకలు మృతిచెందాయి. గుమ్మఘట్ట మండలం కోనాపురం గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. మేకల పోషణతో కుటుంబాన్ని పోషించుకుంటున్న గ్రామానికి చెందిన ఓబులేసు తన వద్ద ఉన్న 25 మేకలను మంగళవారం రాత్రి గ్రామంలోని పాకలో వదిలి ఇంటికెళ్లి నిద్రించాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత మందపై కుక్కలు దాడి చేశాయి. గమనించిన స్థానికులు గట్టిగా కేకలు వేస్తూ కుక్కలను అదిలించారు. అప్పటికే 12 మేకలు మృతి చెందాయి. ఘటనతో రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధిత కాపరి వాపోయాడు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్



అనంతపురం కార్పొరేషన్: 'రాయలసీమపై కూటమి ప్రభుత్వానికి నిజంగా ప్రేమే ఉంటే పెండింగ్ ప్రాజెక్టలను పూర్తి చేయాలి. రూ.7 వేల కోట్ల నుంచి రూ.8 వేల కోట్లతో హంద్రీ-నీవా, గాలేరు నగరి, హెచ్‌ఎల్‌సీ తదితర ప్రాజెక్టులను పూర్తి చేస్తే 10 లక్షల ఎకరాలకు నీరివ్వవచ్చు. పెండింగ్ ప్రాజెక్టలను పూర్తి చేయకుండా సీమకు అన్యాయం జరిగిందంటూ కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడడం సరికాదు' అని మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్ అన్నారు. బుధవారం నగరంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ ప్రాజెక్ట్‌లను పూర్తి చేస్తే ఎక్కడ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి పేరు వస్తుందనే అక్కసుతో సీఎం చంద్రబాబు బనకచెర్ల ప్రాజెక్ట్‌ను తెరపైకి తీసుకొచ్చారన్నారు. రూ.81,900 కోట్లతో ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామంటున్నారని, కానీ కేవలం రూ.7 వేల కోట్లు ఖర్చు చేస్తే రాయలసీమ రైతాంగానికి మేలు చేసినవారవుతారని హితవు పలికారు. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాల్సి ఉంటే..దాన్ని తామే చేపడుతామని చంద్రబాబు తెచ్చుకున్నారన్నారు. తన హయాంలో దివంగత నేత వైఎస్సార్ కేంద్రాన్ని ఒప్పించి 45.72 మీటర్ల ఎత్తుతో పోలవరం డ్యాం నిర్మించేలా అనుమతులు తీసుకువచ్చారని గుర్తు చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ 'పోలవరం' స్పిల్ వే పనులు పూర్తి చేశారన్నారు. డ్యాం ఎత్తును 41.15 మీటర్లకు తగ్గిస్తూ కేంద్రం ఆమోదిస్తే.. అందుకు సీఎం చంద్రబాబు అంగీకరించి, రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీశారని దుయ్యబట్టారు. బనకచెర్ల-పోలవరం ప్రాజెక్ట్‌కు సంబంధించి సీఎం చంద్రబాబు కేంద్రానికి ప్రతిపాదనలు చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. ఈ విషయంలో చంద్రబాబు తీరును తప్పుబడుతూ పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ డైరెక్టర్ మల్లాజీ ఉపాధ్యాయ 14 పేజీల లేఖ రాశారన్నారు. రాయలసీమకు అన్యాయం జరిగిందంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ మాట్లాడుతున్నారని, నిజంగా ఈ ప్రాంతానికి న్యాయం చేయాలనుకుంటే శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం రాజధాని లేదా హైకోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టలన్నీ పూర్తి చేసి న్యాయం చేయాలన్నారు. కేవలం మాటలకు పరిమితం కాకూడదన్నారు. రాయలసీమకు జరుగుతున్న అన్యాయంపై పోరాటాలు చేయడానికి ప్రజలు సిద్ధమవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రసాద్, దీపు, శివశంకర్, పాల్గొన్నారు.

సీమకు జరిగిన అన్యాయాన్ని మాటల్లో చెప్పలేం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్


ర్యాలీలో పాల్గొన్న మాధవ్, తదితరులు

అనంతపురం/టవర్‌క్లాక్: రాయలసీమకు జరిగిన అన్యాయాన్ని మాటల్లో చెప్పలేమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. అనంతపురంలో బుధవారం జరిగిన పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్రానికి 1953లో కేవలం మూడేళ్ల రాజధానిగా కర్నూలు ఉందని, 1956లో రాజధానిని తరలించే క్రమంలో శ్రీబాగ్ ఒప్పందంలో భాగంగా రాయలసీమకు అనేక ప్రయోజనాలను చేకూర్చేలా నిర్ణయాలు తీసుకున్నారన్నారు. నేటికీ శ్రీబాగ్ ఒడంబడికను అమలు చేయకపోడం దురదృష్టకరమన్నారు. రాయలసీమ ప్రాంతంలోని అపరిష్కృత సమస్యలు, సీమ ప్రజల ఆలోచన, ఏంచేస్తే బాగుంటుందనే అంశాలను తెలుసుకునేందుకు ఈ పర్యటన చేపట్టినట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తగిన రూట్‌మ్యాప్‌ను బీజేపీ రూపొందిస్తుందని తెలిపారు.

'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి..

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పని చేయాలని పార్టీ శ్రేణులకు మాధవ్ సూచించారు. అనంతపురం జిల్లా అభివృద్ధికి బీజేపీ మరింతగా కృషిచేస్తుందన్నారు. దక్షిణ భారతదేశంలో తొలిసారిగా కిసాన్ రైలును అనంతపురం నుంచి ప్రారంభించిన అంశాన్ని ఆయన గుర్తుచేశారు. బీజేపీ చొరవతోనే సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ ఏర్పాటైందన్నారు. రాబోవు రోజుల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. చరిత్రాత్మక ప్రదేశాల అభివృద్ధితో పాటు నూతన పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తామన్నారు. సంచార జాతుల పిల్లల చదువులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు విష్ణువర్ధన్‌రెడ్డి, కాపు రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, మాజీ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసులు, అంకాల్‌రెడ్డి, చిరంజీవిరెడ్డి, రామచంద్రయ్య, ఫయాజ్ బాషా, లలిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ అదృశ్యం.. బెంగళూరులో ప్రత్యక్షం

అనంతపురం: నగరంలోని పాతూరు తాడిపత్రి బస్టాండ్ సర్కిల్ వద్ద ఉన్న కస్తూరిబా స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ముగ్గురు బాలికలు అదృశ్యమయ్యారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో స్కూల్ నుంచి ఇంటికి వెళ్లి మధ్యాహ్న భోజనం ముగించుకుని తిరిగి పాఠశాలకు వచ్చేవారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం స్కూల్ నుంచి బయటకు వెళ్లిన విద్యార్థులు సాయంత్రమైనా ఇంటికి చేరుకోలేదు. దీంతో తల్లిదండ్రులు కంగారుపడుతున్న సమయంలో బెంగళూరులో ఉన్నామంటూ ఫోన్ చేసి తెలిపారు. విషయాన్ని వన్‌టౌన్ పోలీసులకు తెలపడంతో ఓ కానిస్టేబుల్‌ను బెంగళూరుకు పంపారు. కాగా, బాలికలను గుర్తించిన బెంగళూరులోని హెబ్బాళ్ పోలీసులు వారిని సురక్షితంగా స్టేషన్‌లో ఉంచారు. బెంగళూరుకు ఎందుకు వెళ్లారనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

కనుల పండువగా రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు పంచాయతీ పరిధిలో ఉన్న ఉండబండ వీరభద్రస్వామి రథోత్సవం బుధవారం కనుల పండువగా సాగింది. మండలంలోని ఉండబండ, పాల్తూరు, చీకలగురికి, విడపనకల్లు, కరకముక్కల, గాజుల మల్లాపురం, ఉరవకొండ, కర్ణాటకలోని బళ్లారి, గదగ్, చిక్‌మంగుళూర్, శివమొగ్గ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. ఉదయం ఆలయంలో వీరభద్రస్వామి, కాళికాదేవి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. సాయంత్రం వేలాది భక్తుల గోవింద నామస్మరణ మధ్య రథోత్సవాన్ని నిర్వహించారు.

జగన్ నాయకత్వానికి ఎన్‌ఆర్‌ఐల అండ: ఆలూరి


వైఎస్ జగన్‌ను కలిసిన ఎన్‌ఆర్‌ఐలు, ఆలూరి సాంబశివారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వానికి ఎన్‌ఆర్‌ఐలు అండగా నిలుస్తున్నారని ఆ పార్టీ ఎన్‌ఆర్‌ఐ విభాగం కో-ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో వైఎస్ జగన్‌ను పలువురు ఎన్‌ఆర్‌ఐలతో కలసి ఆలూరు సాంబశివారెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిలో సుబ్బరామిరెడ్డి (డల్లాస్ – యూఎస్‌ఏ), మధు శ్రీధర్, చాళుక్య రెడ్డి, హుస్సేన్ (యునైటెడ్ కింగ్‌డమ్), గుణశేఖర్, అభిలాష్ (కెనడా), రమేష్ పనాటి (న్యూజిలాండ్), ప్రసన్నకుమార్ రెడ్డి (ఆస్ట్రేలియా), ఇలియాజ్ (గల్ఫ్ కన్వీనర్), సయ్యద్ అక్రం, గూడూరు కోటేశ్వర రెడ్డి, షేక్ అబ్దుల్లా, అరుణ్ చక్రవర్తి, చిన్న నాగముని గుండ్లూరు (దుబాయ్), షా హుస్సేన్ (కువైట్) ఉన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎంకు ఆత్మీయ వీడ్కోలు


సుమంత్.ఆర్.ఆదోనిని సన్మానిస్తున్న ఎన్‌ఎంయూ నేతలు

అనంతపురం క్రైం: ఆర్టీసీ ఆర్‌ఎం సుమంత్.ఆర్.ఆదోనికి ఎన్‌ఎంయూ నేతలు ఆత్మీయ వీడ్కోలు పలికారు. సర్వీసు పూర్తి కావడంతో గురువారం ఆయన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆర్‌ఎం కార్యాలయంలో సుమంత్.ఆర్.ఆదోనిని ఎన్‌ఎంయూ నేతలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంయూ జిల్లా అధ్యక్షుడు సూరిబాబు మాట్లాడుతూ.. ఐదున్నరేళ్లుగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ జిల్లా కార్యదర్శి ప్రతాప్, శ్రీరామ్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ- స్టాంపు నిందితులకు బెయిల్

కళ్యాణదుర్గం రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కళ్యాణదుర్గం నకిలీ ఈ-స్టాంపుల కేసులో ముగ్గురు నిందితులకు బుధవారం బెయిల్ మంజూరైంది. ఏ1 కట్టా భార్గవి, ఏ2 ఎర్రప్ప అలియాస్ మీసేవ బాబు, ఏ3 మోహన్‌బాబులకు బెయిల్ ఇస్తూ కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భాను ఉత్తర్వులిచ్చారు. దాదాపు నెల రోజుల తర్వాత వీరికి బెయిల్ రావడం గమనార్హం.

క్వారీలో కార్మికుడి దుర్మరణం

గుత్తి: కంకర క్వారీలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం నాగులదిబ్బ గ్రామానికి చెందిన సాకే రఘురాములు (32) గుత్తి సమీపంలోని పరమేశ్వర క్రషర్ యూనిట్‌లో కంప్రెషర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో క్రషర్ యూనిట్‌కు సంబంధించి జక్కల చెరువు వద్ద ఉన్న కొండపై భారీ బండరాళ్లను పేల్చేందుకు బుధవారం ఘాతాలు ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యాడు. ఘాతాలు అమర్చేందుకు ఓ బండరాయిపై కంప్రెషర్‌తో రంధ్రం చేస్తుండగా ఒక్కసారిగా డ్రిల్లింగ్ యంత్రం పైకి ఎగిసి రఘురాములను బలంగా తాకింది. దీంతో ఆయన గాలిలోకి ఎగిరి రాళ్లపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సురేష్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్య


మృతురాలు దివ్యకుమారి

గుంతకల్లు టౌన్: స్థానిక భాగ్యనగర్‌కు చెందిన వివాహిత దివ్యకుమారి(35) ఆత్మహత్య చేసుకుంది. 2013లో గుంతకల్లుకు చెందిన చంద్రశేఖర్‌ను ఆమె వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. బియ్యం దుకాణంలో గుమాస్తాగా చంద్రశేఖర్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మంగళవారం ఉదయం పనికి వెళ్లిన ఆయన మధ్యాహ్నం భోజనానికి ఇంటికి చేరుకున్నాడు. ఎంత సేపు పిలిచినా భార్య తలుపు తీయకపోవడంతో బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించి చూశాడు. అప్పటికే బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు వేసుకున్న ఉరికి విగతజీవిగా వేలాడుతున్న భార్యను చూసి వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. కడుపునొప్పితో బాధపడుతున్న తన కుమార్తె జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లుగా మృతురాలి తల్లి లలితమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గుంతకల్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు.

అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రాప్తాడు రూరల్: అంబేడ్కర్ రాజ్యాంగానికి తూట్లు పొడవాలని కూటమి ప్రభుత్వం చూస్తోందని, ఆ రాజ్యాంగాన్ని కాపాడుకుందామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా దేశంలో ఓ పెద్ద కుట్ర జరుగుతోందన్నారు. ఈ క్రమంలో రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు లౌకిక, ప్రజాతంత్ర వాదులు, కుల సంఘాల నాయకులు, వామపక్ష భావజాలం కలిగిన ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ, శింగనమల నియోజకవర్గ కార్యదర్శి కత్తి నారాయణస్వామి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, అనంతపురం రూరల్ మండల కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి నరేష్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ధనుంజయ, నాయకులు దుర్గాప్రసాద్, ఆనంద్, మంజునాథ్, చందు పాల్గొన్నారు.

నమ్మకద్రోహులకు బుద్ధి చెప్పండి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్


విద్యుత్ బిల్లుల గురించి ప్రజలతో ఆరా తీస్తున్న రాంభూపాల్

గుంతకల్లు టౌన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట తప్పడమే కాకుండా ప్రజలను నమ్మించి నట్టేట ముంచిన నమ్మకద్రోహుల కూటమికి తగిన బుద్ధి చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. బుధవారం గుంతకల్లుకు విచ్చేసిన ఆయన తిలక్ నగర్ తదితర ఏరియాల్లో పర్యటించారు. ప్రతి నెలా విద్యుత్ బిల్లులు ఎంత మేరకు వస్తున్నాయని ప్రజలు, చిరు వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.15,485 కోట్ల భారాన్ని ప్రజలపై మోపడం దుర్మార్గమన్నారు. స్మార్ట్ మీటర్లను బిగిస్తే వాటిని పగలగొట్టాలని యువగళం పాదయాత్రలో పిలుపునిచ్చిన నారా లోకేష్.. ఇప్పుడు మాట తప్పాడని విమర్శించారు. రానున్న రోజుల్లో విద్యుత్ పంపిణీ ప్రైవేటీకరణ చేసి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి కూటమి ప్రభుత్వం పెద్ద కుట్ర చేస్తోందని విమర్శించారు. విద్యుత్ ఛార్జీల నిలువుదోపిడీని ఆపాలని, ప్రమాదకర స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలని, ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించరాదని డిమాండ్ చేశారు. విద్యుత్ బిల్లుల భారాల్ని తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 5న గుంతకల్లులోని విద్యుత్ డీఈ కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి, నాయకులు నాగరాజు, రమేష్, రంగమ్మ, చంద్ర, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ సహార్

అనంతపురం కార్పొరేషన్: జిల్లాలోని వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యం. ఉల్లాస్ పేజ్–2 అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ సహార్ పిలుపునిచ్చారు. బుధవారం నగరపాలక సంస్థలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 1,25,578 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రోజూ సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు బోధనాభ్యాసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. బోధనకు ఉపయోగపడే సామగ్రిని అందజేయడం జరుగుతుందన్నారు. 2023లో నిర్వహించిన కాస్ట్ సర్వే ద్వారా జిల్లాలో 15 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన 3,76,734 మంది నిరక్షరాసులను గుర్తించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శైలజ, విద్యాశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు. బుధవారం 38, 39వ డివిజన్లలో తాగునీటి సమస్య ఉందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో మేయర్ ఆ ప్రాంతంలో పర్యటించారు. కొన్ని ఇళ్లకు బ్లూ పైప్‌లైన్ కనెక్షన్లు లేవని తెలుసుకుని వారికి కనెక్షన్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధు, డీఈ సత్యనారాయణ, ఏఈ రాజశేఖర్ రెడ్డి, ట్యాప్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం



మాట్లాడుతున్న చంద్రశేఖర్ యాదవ్

అనంతపురం రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ మండిపడ్డారు. బుధవారం నగరంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. అక్కడ అందుతున్న సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ..పేద విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. విద్యా సామగ్రి, ట్రంక్ పెట్టెలు, బెడ్ షీట్లు కూడా అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు సరిపడ గదులు, మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు సుజాతరెడ్డి, విద్యార్థి విభాగం నాయకులు ఫయాజ్, రాహుల్‌రెడ్డి, లోకేష్, గౌస్ పాల్గొన్నారు.

అధ్వానంగా మెడికల్ క్వార్టర్స్



మెడికల్ కళాశాల ప్రవేశమార్గంలో దుస్థితి..



ఆర్ఎంఓ ఇంటి ప్రహరీని కూలగొట్టి షెడ్లు ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్



మెడికల్ క్వార్టర్స్‌లో రోడ్డు గుంతలమయం

- ఎక్కడ చూసినా చెత్తా చెదారమే..
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ సిస్టమ్
- మురుగు బయటకు వెళ్లకపోవడంతో దుర్వాసన
- ఇబ్బందులు పడుతున్న వైద్యులు

అనంతపురం మెడికల్: నిరంతరం ప్రజారోగ్యం కోసం పాటుపడే వైద్యులు, ఉద్యోగులు నివసిస్తున్న మెడికల్ క్వార్టర్స్ గలీజుగా మారింది. వందల కుటుంబాలు నివసించే ప్రదేశంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. క్వార్టర్స్‌లో ఎక్కడ చూసినా చెత్తా చెదారం దర్శనమిస్తోంది. గుంతల రోడ్లు, నిరుపయోగంగా ఓపెన్ జిమ్, ఏపుగా పెరిగిన ముళ్లపొదలు.. వీటన్నింటితో వైద్యులు, ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. క్వార్టర్స్ నిర్వహణను పట్టించుకోవడంలో అటు ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా.. ఇటు సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మరాం ఘోరంగా విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా మేలుకుని తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

కంపోస్టును తలపిస్తున్న క్వార్టర్స్

మెడికల్ కాలేజ్ క్వార్టర్స్ కంపోస్టు యార్డును తలపిస్తోంది. క్వార్టర్స్ ప్రారంభంలోనే చెత్తాచెదారం, ఎటు చూసినా ఎండిపోయిన చెట్లు, జిమ్ నిర్వహణ లేకపోవడంతో దాని చుట్టూ పెద్ద ఎత్తున చెట్లు పెరిగాయి.

క్వార్టర్స్‌కు ఎటువంటి భద్రత లేదు. బయట వ్యక్తులు వచ్చినా దిక్కులేని పరిస్థితి. నిత్యం ప్రజారోగ్యం కోసం పాటు పడే వైద్యులు, సిబ్బందికి కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రైనేజీ బ్లాక్..

మెడికల్ క్వార్టర్స్‌లో టీచింగ్ స్టాఫ్‌కు సంబంధించి 48 పోర్షన్లు, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు సంబంధించి 48 పోర్షన్లు, వైద్యులకు సంబంధించి 5 పోర్షన్లు, ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, ఆర్ఎంఓ భవనాలు ఉన్నాయి. ఇందులో 100 కుటుంబాల వరకు జీవనం సాగిస్తున్నాయి. ప్రిన్సిపాల్, ఆర్ఎంఓ భవనాలు భూత్ బంగ్లాలను తలపిస్తున్నాయి. ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్ల నిర్లక్ష్యంతో అక్కడ పనులు చేసే కాంట్రాక్టర్ ఏకంగా ఆర్ఎంఓ ఇంటిని సిమెంట్, తదితర భవన సామగ్రికి వాడుకుంటున్నాడు. ఆ ఇంటి ప్రహరీని కూలగొట్టి షెడ్లు వేసుకుని వారికి సంబంధించిన వస్తువులను ఉంచారు. మెడికల్ క్వార్టర్స్ మురుగు వెళ్లకుండా ఉండేందుకు అక్కడ నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టర్ కాలువను మూసేశాడు. దీంతో మురుగు బయటకు వెళ్లకపోవడంతో డ్రైనేజీ బ్లాక్ అయ్యింది. దుర్వాసన భరించలేక చాలా మంది వైద్యులు, సిబ్బంది క్వార్టర్స్‌ను ఖాళీ చేసి వెళ్లిపోయే పరిస్థితి నెలకొంది. రేడియాలజీ, మెడిసిన్, గైనిక్, తదితర పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులే చిన్నపాటి మరమ్మతులు చేయించుకుని జీవనం సాగిస్తున్నారు.



డ్రైనేజీ బ్లాక్ కావడంతో పేరుకుపోయిన మురుగు

పాములు వస్తున్నాయి



క్వార్టర్స్‌లో డ్రైనేజీ సరిగా లేదని ఇప్పటికే చాలా సార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇక్కడ చూస్తే భయానక పరిస్థితులు ఉన్నాయి. క్వార్టర్స్‌లో పాములు సంచరిస్తున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ చాలా దారుణంగా ఉంది. చిన్న పిల్లలకు ఏమైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– వెంకటకృష్ణ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి

పారిశుధ్య పనులు చేపడతాం..



ఇటీవల మెడికల్ క్వార్టర్స్‌ను పరిశీలించాను. నిజంగా చాలా అధ్వానంగా ఉంది. క్వార్టర్స్‌లో పారిశుధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. శానిటేషన్, సెక్యూరిటీ ఏర్పాటు చేస్తాం. ఏమైనా ఖాళీలుంటే పీజీ విద్యార్థులకు అక్కడ వసతి కల్పించేందుకు ఏర్పాట్లు చేయిస్తాం.

– డాక్టర్ షారోన్ సోనియా, ప్రిన్సిపాల్, మెడికల్ కాలేజ్

తల్లిదండ్రులు దైవ స్వరూపులు



మాట్లాడుతున్న డీఆర్ఓ మలోల

అనంతపురం అర్బన్: 'తల్లిదండ్రులు దైవస్వరూపులు. వృద్ధాప్యంలో వారి బాగోగులు చూసుకోవాల్సిన బాధ్యత సంతానంపై ఉంటుంది. బాధ్యతను విస్మరించి నిరాదరణకు గురిచేసే వారిపై చర్యలు ఉంటాయి. ఇందు కోసం ప్రత్యేకంగా ఆర్‌డీఓ స్థాయిలో ట్రిబ్యునల్ ఉంది.' డీఆర్ఓ మలోల స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో వయో వృద్ధులు పోషణ సంరక్షణ చట్టం–2007పై అధికారులు, వయోవృద్ధులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వృయోవృద్ధులతో ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్య తెలుసుకుని పరిష్కరించాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో సత్వర వైద్యం అందించాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డీఓ కేశవ నాయుడు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి అర్చన, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, డీఆర్‌డీఏ పీడీ శైలజ, సీనియర్ అడ్వకేట్ నల్లప్ప, అధికారులు, సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

కీర్తన ఫైనాన్స్‌పై చర్యలు తీసుకోవాలి

అనంతపురం అర్బన్: కీర్తన ఫైనాన్స్ సంస్థ తన ఖాతాదారులకు చేసిన మోసాలపై సమగ్ర విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్, మహిళా సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తిలక్ రోడ్డులోని కీర్తన ఫైనాన్స్ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సంతోష్ కుమార్, మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షురాలు పద్మావతి మాట్లాడారు. ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ చేసి దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత ఖాతాదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పార్వతిప్రసాద్, నాయకురాళ్లు జానకి, యశోదమ్మ, కమ్మక్క, ఏఐవైఎఫ్ నాయకులు ఆనంద్, శ్రీనివాస్, కన్నా, శర్మాస్, తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబు మోసాలను ఎండగడదాం'



మండల మహిళా కన్వీనర్లతో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



చిగిచెర్ల నారాయణ రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: ఎన్నికల ముందు అలవికాని హామీలిచ్చి.. వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన చంద్రబాబు మోసాలను ఎండగట్టేందుకు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సూచించారు. బుధవారం అనంతపురం రూరల్ మండలంలోని టీవీ టవర్ సమీపంలో ఎస్‌జేఆర్ ఫంక్షన్ హాల్‌లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంపై విస్తృత సాయి సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం నియోజకవర్గంలోని మండల మహిళా కన్వీనర్లను ప్రకటించారు. రాప్తాడు మహిళా కన్వీనర్‌గా వరలక్ష్మి, ఆత్మకూరు మహిళా కన్వీనర్‌గా మంజుల, అనంతపురం రూరల్ మండల మహిళా కన్వీనర్–1గా ప్రమీల, అనంతపురం రూరల్ మండల మహిళా కన్వీనర్–2గా అనిత, రామగిరి మండల మహిళా కన్వీనర్‌గా సుమలత, చెన్నేకొత్తపల్లి మండల మహిళా కన్వీనర్‌గా రజిని, కనగానపల్లి మండల మహిళా కన్వీనర్‌గా బోయ దివ్యశ్రీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ అధ్యక్షురాలు ఉషారాణి,శివయ్య పాల్గొన్నారు.

పరామర్శ..

రాప్తాడు: అధైర్య పడకండి.. మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం. ఏ సమస్య వచ్చినా తాను ముందుంటాను అని చిగిచెర్ల నారాయణ రెడ్డి కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి భరోసా ఇచ్చారు. మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన చిగిచెర్ల నారాయణ రెడ్డి, దంపతులను టీడీపీ నాయకులు గంగలకుంట గ్రామ పొలంలో భూ తగదా విషయంలో ఇటీవల హత్య చేసిన విషయం విదితమే. అప్పట్లో కుటుంబ సభ్యులను తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. బుధవారం ఆయన రాప్తాడుకు విచ్చేసి చిగిచెర్ల నారాయణ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. చట్టపరంగా పోరాటం చేద్దామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మండల కన్వీనర్ సాకే వెంకటేష్, యూత్ మండల కన్వీనర్ విశ్వనాథ రెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ జూటూరు లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి రుణపడి ఉంటాం

ఆత్మకూరు: ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.10 లక్షల మండల పరిషత్ నిధులు కేటాయించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయడం హర్షణీయమని పలువురు హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కమ్యూనిటీ భవణ నిర్మాణానికి భూమి పూజ చేసిన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీవాసులు ఎంపీపీ హేమలతను కలిశారు. కమ్యూనిటీ భవణ నిర్మాణానికి నిధులు కేటాయించేందుకు చొరవ తీసుకోవడంతో అభినందించారు. మండల అధికారులు చొరవ తీసుకుని కమ్యూనిటీ భవణ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ కాలనీ వాసులు వన్నూరప్ప, రామాంజి, వెంకటేశులు, సుబ్బరాయుడు, ఈశ్వరయ్య, వార్డు మెంబర్ ఈశ్వరయ్య, ఓబుళపతి, రామాంజనేయలు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న ఎస్సీ కాలనీవాసులు

మీటర్ రీడర్లను ఉద్యోగులుగా గుర్తించండి



ఎస్ఈకి వినతిపత్రం ఇస్తున్న మీటర్ రీడర్లు

అనంతపురం టౌన్: విద్యుత్ శాఖలో విద్యుత్ మీటర్ల రీడర్లగా పని చేస్తున్న కార్మికులను సంస్థ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం విద్యుత్ మీటర్ల రీడర్లతో కలిసి విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించకపోతే ఆగస్టు 1వ తేదీ నుంచి విద్యుత్ బిల్లులు కొట్టే ప్రసక్తే లేదన్నారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్ మీటర్ రీడర్లతో చర్చించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఇది ఇలాగే కొనసాగితే ఎస్ఈ కార్యాలయం ముందు నిరహార దీక్షలు చేపడతామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ మీటర్ రీడర్లు రాజేష్‌గౌడ్, రాము, దస్తగిరి, సుబ్రహ్మణ్యం, సలీం, రంగస్వామి, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

రాప్తాడు: రైతులు తాము సాగు చేసిన పంటలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కృష్ణ చైతన్య పేర్కొన్నారు. బుధవారం మండలంలో అయ్యవారిపల్లి గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. పంటల బీమా నమోదు చేయించుకోవడానికి ఈనెల 31వ తేదీ చివరి తేదీ అని తెలిపారు. అన్నదాత సుఖీభవకి సంబంధించి అర్హత ఉండి, జాబితాలో అనర్హులుగా వచ్చిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో అర్జీలు పెట్టుకోవాలన్నారు. మండలంలో కౌలు రైతులు ఉంటే కౌలు కార్డులు చేయించుకోవాలని సూచించారు.

రేపు వాహనాల వేలంపాట

ఆత్మకూరు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 5 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలకు శుక్రవారం బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ద్విచక్ర వాహనాలకు రూ.2 వేలు, ఆటోలకు రూ.3 వేలు రుసుము చెల్లించాలన్నారు. ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకుని రావాలన్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

రాప్తాడు: మరూరులోని బీసీ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం ధ్వజస్తంభం, విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆలయంలో పూజలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సాకే వెంకటేష్, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, యూత్ మండల కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డి, నాయకులు మాచిరెడ్డి చెన్నారెడ్డి పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌లో సవరణలు

అనంతపురం కార్పొరేషన్: ఎల్ఆర్ఎస్‌లో ప్రభుత్వం కొన్ని సవరణలు చేసిందని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది జూన్ 30 వరకు కట్ ఆఫ్ తేదీగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కాగా ఈ తేదీలోపు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లు ఈ పథకంలోకి అర్హత పొందాయన్నారు. లేఅవుట్‌లో కనీసం ఒక ప్లాట్ విక్రయమై ఉండాలన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి

సంక్షిప్త సమాచారం

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కోర్టు రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలలో మొక్కలు నాటారు. చెట్ల వలన కాలుష్యం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుమ్, డీన్లు సిరాజుద్దీన్, చిరంజీవి, ఏఓ గోపాల్, అకడమిక్ కో–ఆర్డినేటర్ ఇర్షాద్ పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే..



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఆత్మకూరు: శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అర్చకులు ఘనంగా కల్యాణం జరిపించారు. శ్రీవల్లి దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వర ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేద పండితుల మంత్రాలు, మంగళవాయిద్యాలతో పసుపు, కుంకుమ కలిపిన అక్షింతలతో కల్యాణం జరిపించారు. భక్తులకు ప్రసాదం అందజేశారు.

కళారంగంలో పాటే ఆయుధం

అనంతపురం అర్బన్: కళారంగంలో పాట ప్రాథమిక ఆయుధం వంటిదని ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకుడు జగన్ అన్నారు. బుధవారం స్థానిక గణేనాయక్ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలను జాగృతి పర్చడంలో పాట గొప్ప ఆయుధమన్నారు. కళలు, కళాకారులను గుర్తించి వారి ద్వారా జిల్లాలో ప్రజానాట్యమండలిని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా మార్గదర్శి ఎం.కృష్ణమూర్తి, కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు లక్ష్మీనారాయణ, ఎర్రిస్వామి, ఈశ్వర్, లక్ష్మీనారాయణ, పుల్లన్న, బ్రహ్మయ్య, నాగేంద్ర, కృష్ణవేణి, అశ్విని, చంద్రిక పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి వీడ్కోలు

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం బదిలీ అయిన 14 మంది వైద్య సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొత్తగా వచ్చిన వైద్య సిబ్బందికి ఆహ్వానం పలికారు. అలాగే ఉద్యోగ విరమణ చేసిన ఆశావర్కర్ సుభద్రమ్మను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ సబిహా సుల్తానా పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఆలయ వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్: రామ్‌నగర్ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నేత్రపర్వంగా సాగాయి. గణపతి, శ్రీదేవి, భూదేవి, ఆంజనేయ స్వామి, విశ్వక్సేనుడు, గరుత్మంతుడు, నవగ్రహదేవతా మూర్తుల విగ్రహాలకు విశేష పూజలు జరిగాయి. వేర్వేరు ప్రాంతాల నుంచి విచ్చేసిన అర్చకులు భక్తిశ్రద్ధలతో హోమాలు చేపట్టారు.

మట్కా బీటర్ అరెస్ట్

అనంతపురం: నగరంలో రాజీవ్ కాలనీ బస్టాండ్ వద్ద మట్కా బీటర్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ కే.శాంతిలాల్ తెలిపారు. పి.క్రిష్టప్ప కుమారుడు పి. శ్రీనివాసులు (50) మొబైల్ క్యాంటీన్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. చెడు అలవాట్లకు బానిస అయ్యాడు. సంపాదన సరిపోక, సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో మట్కా బీటర్‌గా అవతారం ఎత్తాడు. బుధవారం మట్కా రాస్తున్న సమయంలో శ్రీనివాసులును పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ.3,230 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

నేడు నీటి సరఫరాలో అంతరాయం

అనంతపురం కార్పొరేషన్: పీఏబీఆర్ డ్యాంలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మోటరు కరెంటు సరఫరా చేసే 300 ఎస్క్యూఎంఎం కేబుల్ కాలిపోవడంతో గురువారం నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎస్ఈ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు.

సైలెన్సర్ల ధ్వంసం

అనంతపురం: ద్విచక్ర వాహనాలకు కంపెనీ అమర్చే సైలెన్సర్లు కాకుండా ..భారీ శబ్దం వచ్చే సైలెన్సర్లను బిగించి రోడ్లపై తిరిగితే చర్యలు తప్పవని ఎస్పీ పి. జగదీష్ హెచ్చరించారు. అనంతపురం నగర పోలీసులు స్వాధీనం చేసుకున్న 150 టూ వీలర్ల సైలెన్సర్లు, 300 ఆటోల హార్న్‌లను టవర్‌క్లాక్ వద్ద రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. కార్యక్రమంలో అనంతపురం అర్బన్ డీఎస్పీ వి. శ్రీనివాస రావు, సీఐలు వెంకటేశ్ నాయక్, శ్రీకాంత్ యాదవ్, శాంతిలాల్, జగదీష్, ఎస్ఐలు శ్రీనివాస్, రుష్యేంద్రబాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు

అనంతపురం కల్చరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకుని బుధవారం ఇస్కాన్ మందిరంలో చిన్నారులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కలరింగ్, సృజన విభాగాల్లో చిన్నారులు శ్రీకృష్ణ లీలా విశేషాలకు అద్భుత రూపునిచ్చి ఆకట్టుకున్నారు. నిర్వాహకులు ఇస్కాన్ జిల్లా ఇన్‌చార్జి దామోదర గౌరంగదాసు మాట్లాడుతూ.. ఈనెల 15 , 16 తేదీలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తొలిరోజు చిత్రలేఖన పోటీలు జరిగాయని, గురువారం వ్యాసరచన పోటీలు, శుక్రవారం క్విజ్, సంప్రదాయ వేషధారణల పోటీలు జరుగుతాయన్నారు. పోటీల సమన్వయకర్తలు రమ్యమాతాజీ, సుధీర్ వర్మ మాట్లాడుతూ.. ఆగస్టు 15న విజేతలుగా నిలిచిన ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, 16న ఉన్నత విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు.

ఢిల్లీ సీఎంకు సన్మానం

అనంతపురం రూరల్/అనంతపురం టవర్‌క్లాక్: ఢిల్లీ సీఎం రేఖాగుప్తాను ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు బుధవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఏపీ ఆర్యవైశ్య యువజన సంఘం దుపకుంట్ల శబరి వరప్రసాద్ మాట్లాడుతూ.. ఆర్యవైశ్య తొలి మహిళా ముఖ్యమంత్రిగా ఎన్నికైన రేఖా గుప్తా ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నడిపించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నెరమెట్ల ఎల్లన్న కోరారు. బుధవారం స్థానిక బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. దాడులపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్లినప్పుడు కౌంటర్ కేసులు పెడుతున్నారన్నారు. దాడులకు పాల్పడిన వారిని తక్షణం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలన్నారు.